ఎం.ఎస్.మూర్తి



# గమ్యస్థానం

'శేషయ్యా!'

'ప్రభూ!'

'ఏం అలా చూస్తున్నావేం?'

'ఏమీ లేదండి-మీ ధోరణి చూస్తుంటే మళ్ళీ ఏదో...'

'భయపడకు శేషయ్యా-పూరికేనే, వూసుపోక పలకరించాను-'

'ధన్యుణ్ణి!'

'అయితే శేషయ్యా-?'

'ప్రభూ!'

'చూడూ—?'

'చూస్తున్నానండి— భరిస్తున్నానండి'

'మన పూరికి-'

'ఊఁ!'

'మనపూరికి-సిరిపురం ఎంతదూరమోయ్?'

'ఇంతేనాండీ-చంపేశారనుకున్నా-!'

'ఇంతేనోయ్!'

'చిత్తం! ప్రభువులకి సిరిపురం ప్రసక్తి ఎందుకు వచ్చినట్టండీ?'

'అనవసర ప్రసంగం మనకి వొద్దు శేషయ్యా- అడిగినదానికి సమాధానం సూటిగా రావాలి-నే నడిగేది-మనపూరికి సిరిపురం ఎంతదూరమని—తెలిస్తేచెప్పు, లేకపోతే-'

'చిత్తం! సిరిపురం ఇక్కడికి పదహారుమైళ్ళలో వుందండి-'

'ఇంతేనా?'

'ఇంతేనండి-వెడదామా?'

'ఎబ్బే! ఎందుకోయ్, వూరికేనే అడిగేను-'

'అలాగనాండి!'

'అయితే చూడు శేషయ్యా?'

'ప్రభూ!'

'సిరిపురం మనవూరికి పదహారు మైళ్ళని కదూ అన్నావు?'

'అవునండి.'

'రైట్! అయితే, సిరిపురానికి మన వూరు ఎన్నిమైళ్ళలో వుంటుందో కొంచం ఆలోచించి చెప్పగలవా?'

'ప్రభూ! పదండి-వెడదాం-'

'ఎక్కడికి-సిరిపురమే?'

'కాదండి- ప్రమాదకరమైన ఆలోచనలు చేసేవారిని దాచేచోటుకి-'

'శేషయ్యా! ఇదివేళాకోళానికి సమయంకాదు-మనవూరికి సిరిపురం పదహారు మైళ్ళయితే, సిరిపురానికి మన వూరు ఎన్నిమైళ్ళని అడుగుతున్నా-సూటిగా చెప్పు-'

'ప్రభూ! ఇలా ఏడిపించదంభావ్యం కాదు- ఈ వూరికి ఆ వూరెంతో, ఆ వూరికి ఈ వూరుకూడా అంతే అన్న సంగతి మీకు తెలియకపోదనుకుంటా-'

'అయితే సిరిపురానికికూడా మన వూరు పదహారు మైళ్ళేనంటావ్?'

'నేననేదేమిటండీ-ఇది గొప్ప సత్యం కాదూ?'

'నిజంగా!'

'ప్రభూ! నిజం! నిజం! నిలువెల్లా నిజం!'

'శేషయ్యా!'

'హా! ప్రభూ!'

'ఎంత అపఖ్యాతి!'

'ఏమిటండీ?'

'సిరిపురానికి మనవూరుకూడా పదహారుమైళ్లే వుండటం-'

'నిజమేనండి-మన ఖర్మకాలితే ఏం చేస్తాం మరీ?'

'శేషయ్యా! అది అలా వీల్లేదు. సిరిపురానికి మనకి పదహారుమైళ్ళకంటే ఎక్కువే వుండాలి-'

'ఇది ఎలా సాధ్యమండి?'

'సాధ్యం కాకపోతే సాధ్యమయ్యేటట్టు చెయ్యాలి-నువ్వే చెప్పావ్, వాళ్లెవళ్ళో ప్రయత్నించి ఎవరెస్టు శిఖరాన్ని అందుకోగలిగారని!'

'దానికీ దీనికి పోలికలేదు -ప్రభూ!'

'శేషయ్యా! అదంతా నాకొద్దు - ఇరవైనాలుగ్గంటలలోగా -'

'హా! ప్రభూ!'

'ఇదుగో! తక్షణం సిరిపురం వెడుతున్నా-పదహారుమైళ్ళకదూ అన్నావ్?'

'అవునండి !'

'సరే-తక్షణం సిరిపురం-మనవూరికి పదహారు మైళ్ళలోవున్న సిరిపురం-వెడుతున్నా-'

'వెళ్ళి ?'

'అక్కడకు జేరుకుని మళ్ళీ నేను ఇక్కడకు తిరిగివచ్చేసరికి ఆ వూరి నుండి ఈ వూరికి దూరం ఆ పదహారు మైళ్లే వుంటే నేను సహించేవాడినికాను-సాధ్యమైనన్నిమైళ్ళు ఎక్కువవుండాలి-'

'ప్రభూ ! నాకు ఏడుపొస్తూంది'

'ఏమీలేదు-భయపడకు-మళ్ళీ నేను అట్నుంచి ఇటు బయల్దేరేసరికి మన వూరు కొన్నిమైళ్ళు వెనక్కు జరిపించు-'

'హా !'

'ఛీ ! వెధవభయం !'

'ప్రభూ ! మాటవరసకి మీరు అట్నుంచి ఇటు వచ్చేసరికి మనవూరు ఇంకో నాలుగుమైళ్ళు వెన క్కెవెడుతుం దనుకోండి-'

'అవునూ ! ఇంతే మనక్కావల్సింది'

'ప్రభూ ! అంతే అయితే, మళ్ళీ మన వూరికి సిరిపురం ఇరవైమైళ్ళు కాదండీ?'

'చంపేశావ్! శేషయ్యా ! నా ఆశలన్నీ కూలిపోయాయ్ ! నువ్వుచెప్పింది నిజమేలావుంది ! హరేరాం !'

'ప్రభూ ! ధైర్యం వహించండి!'

'ఇంకేం ధైర్యం శేషయ్యా ? అయితే ఇంక ఎప్పటికీ మనవూరికి సిరిపురం ఎంతో సిరిపురానికి మనవూరూ అంతే అవుతూ వుంటుందంటావ్?'

'అదేనండి నేననేది ?'

'ఛీ ! వెధవ పరిస్థితులూ, వెధవ వూళ్ళూను!'

'ఇవి ఎప్పుడూ వుండే పరిస్థితు లేనండి-'

'అయినా, సిరిపురానికి బొత్తిగా మర్యాద తెలియదోయ్ ! మనవూరు సిరిపురానికి దూరంగా వెళ్ళి గడించుకుంటానన్న దూరాన్ని మళ్ళీ సిరిపురం కూడా గడించుకుంటుందనేదే నాకు తలతిక్క తెచ్చిపెట్టే విషయం, ఎంత మొండి సిరిపురం !'

'చిత్తం! ఇలాంటి పరిస్థితులలో అసలు మనవూరు సిరిపురానికి దూరంగా పోతాననడమే తప్పండి-'

'తప్పేనంటావా? మనవూరిదే ఆ తప్పు!'

'ఔనండి !'

'శేషయ్యా ! మనవూరు' సిరిపురం కూడా వెధవ్వూళ్ళే-పద- పట్నంపోయి కానెమరా హోటల్లో బ్రతుకుదాం-'

